ప్రజాశక్తి
మంగళవారం 25 మార్చి 2025





అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

రైతుకు అకాల నష్టం..!

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి నేలకూలింది. ఎన్నో ఆశలతో కష్టాలు తీరుతాయని పంటపై గంపెడాశపెట్టుకున్న రైతులకు అకాల వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి ఉమ్మడి జిల్లాలో వందలాది ఎకరాల్లో ఉద్యానవన పంటలు నేలకూలాయి. చేతికొచ్చిన పంట నోటికందే సమయంలో నేలకూలడంతో అన్నదాత గుండె కన్నీటి సంద్రం అయ్యింది. ఏదోఒక రూపంలో ప్రతి ఏడాదీ పంటలను కోల్పోతున్న తమను ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యం అంటూ అన్నదాతలు అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట కన్నీటి పర్యవంతం అవుతున్నారు.



ఈదురుగాలులతో నేలకొరిగిన అరటిపంట

- ◆ చేతికొచ్చిన పంట నోటికందకుండా నాశనం
- ◆ గాలులు, వర్షంతో నేల రాలిన ఉద్యానవన పంటలు
- ◆ దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి సవిత
- ◆ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : వైసిపి
- ◆ ఆదుకోవాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి బలమైన గాలులు వీచాయి. దీంతో శింగనమల, తాడిపత్రి, ధర్మవరం తదితర నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. అరటిపంట కోత దశలో ఉన్న సమయంలో ఈ విపత్తు రావడం రైతులకు పెను కష్టాన్ని తెచ్చిపెట్టింది. వారం, పది రోజుల్లో కోతలు కోయాల్సిన సమయంలో పంట మొత్తం నేలకొరిగిపోవడంతో అపారమైన నష్టం సంభవించింది. ఈ నష్టం చూసి అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జాంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అరటి రైతులు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. శింగనమల, యల్లనూరు, పుట్లూరు, పెద్దపప్పూరుతోపాటు, సత్యసాయి జిల్లాలో తాడిమర్రి ప్రాంతాల్లో పంటనష్టం తీవ్రంగా ఉంది. అధికారులు ఇంకా నష్టం అంచనాలు వేసే పనిలో ఉన్నారు. మంగళవారం నాటికి పూర్తి స్థాయి నష్టం అంచనా వచ్చే అవకాశముందని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

కదిలిన అధికార యంత్రాంగం

అపారమైన పంటనష్టం సంభవించడంతోపాటు ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నంకు పాల్పడడంతో ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించింది. సోమవారం నాడు బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మలు అధికారులతో కలిసి యల్లనూరు, పుట్లూరు మండలాల్లో పర్యటించారు. కూలిపోయిన అరటితోటలకు స్వయంగా వెళ్లి పంటనష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని రైతులకు భరోసానిచ్చారు. అనంతరం ఆత్మహత్యాయత్నంకు పాల్పడి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం బాధిత రైతులందరినీ ఆదుకుంటుందని మంత్రి తెలియజేశారు.

భరోసా ఇవ్వని ప్రభుత్వం

వైసిపి నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి

'ప్రకృతి వైపరిత్యాలు ఎప్పుడూ సంభవిస్తూనే ఉంటాయి. ఇటువంటి సమయంలో ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించేలా ధైర్యం ఇవ్వాలి. గడిచిన తొమ్మిది నెలల కాలంలో అటువంటి భరోసాను కూటమి ప్రభుత్వం రైతులకు ఇవ్వలేదు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో నష్టం సంభవిస్తే ప్రభుత్వం ఆదుకుంటుందన్న భరోసా రైతులకు ఉండేది. అది ఇప్పుడు లేకపోవడం వల్లనే ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించారు. ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి' అని వైసిపి నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు.

రైతులను ఆదుకోండి

వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

పంటనష్టపోయిన రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిని విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి, దానిమ్మ పంటకు ఎకరానికి లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొప్పాయి ఇతర ఉద్యానవన పంటలకు ఎకరానికి రూ.50 వేలు పరిహారమివ్వాలన్నారు. ఆత్మహత్యాయత్నంకు యత్నించిన రైతులకు మెరుగైన చికిత్స అందివ్వాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా నష్టపోయిన ప్రతీ రైతుకూ పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రతివారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా శాఖల అధికారులతో కలిసి 227అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులకు సమగ్రమైన, సంతప్తికరమైన పరిష్కారాలు చూపించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంయుక్త కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

29లోపు ఈకేవైసీ నమోదు పూర్తికావాలి

ఈ నెల 29వ తేది లోపు రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోని కార్డుదారులకు రేషన్ ఇవ్వరన్నారు. ఈ నెల29వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలు మినహా మిగిలిన లబ్దిదారులందరి ఈకేవైసి పూర్తి చేయించుకోవాలని తెలియజేశారు.

చిన్నారులతో కరపత్రాల పంపిణీ

ప్రయివేటు కళాశాలల నిర్వాకం



ప్రయివేటు కళాశాలల కరపత్రాన్ని పంచుతున్న పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి-రొద్దం

కొన్ని ప్రయివేటు కళాశాల యాజమాన్యాలు పాఠశాలల విద్యార్థులను వారి పనిమనుషుల్లా ఉపయోగించుకుంటున్నారు. వారి కళాశాలల్లో అడ్మిషన్ల కోసం పాఠశాల విద్యార్థులతో కరపత్రాలను పంపిణీ చేయిస్తున్నారు. 10వ తరగతి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులకు ఈ కరపత్రాలను పంపిణీ చేయిస్తున్నారు. సోమవారం నాడు రొద్దం పరీక్ష కేంద్రం వద్ద ఓ విద్యార్థి ఇలా కరపత్రాలు పంచుతూ కన్పించాడు. రొద్దం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మోపర్లపల్లి గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి పరీక్ష కేంద్రం వద్ద మడకశిర మండలం అయ్యవారిపల్లి గ్రామం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన కరపత్రాలను పంపిణీ చేస్తూ కన్పించాడు. ఇదే పరీక్ష కేంద్రం వద్ద తెలుగు పరీక్ష రోజు కూడా పెనుకొండ అక్షర కళాశాల యాజమాన్యం చిన్న పిల్లల చేత కరపత్రాలను పంపిణీ చేయించింది. పిల్లలతో ఇలాంటి పనులు చేయించకూడదని తెలిసి కూడా ప్రయివేటు యాజమాన్యాలు వారిని ఉపయోగించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల విద్యార్థులతో కరపత్రాలు పంపిణీ చేయించిన ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమార్కులకు శిక్ష తప్పదు

◆ జిల్లాలో వైసీపీ అక్రమాలు బయటపడుతున్నాయ్.. ◆ కాంగ్రెస్ వైపు జగన్ చూపు ◆ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

'వైసిపి ప్రభుత్వంలో జిల్లాలో అనేక స్కామ్‌లు, భూ కబ్జాలు జరిగాయి.. ఇవి ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.. ఇందులో తప్పు చేసిన అక్రమార్కులందరికీ చట్ట ప్రకారం శిక్ష తప్పదు' అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. పెనుకొండ పట్టణంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్‌కు మంత్రి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లాలో అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం శిక్షిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేశారన్నారు. తన క్రషర్‌లో తానే దొంగతనం చేసినట్లు తప్పుడు కేసు పెట్టి వేధింపులకు గురి చేశారని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు వెళ్లడం లేదని అక్రమాలు, స్కామ్‌లకు పాల్పడిన వారినే చట్టపరంగా దర్యాప్తు నిర్వహించి, కేసులు నమోదు చేస్తుందని తెలిపారు. జగన్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని మంత్రి ఆరోపించారు. కొద్ది రోజులుగా ఆడుదాం ఆంధ్రాలో చోటు చేసుకున్న అవకతవకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని మంత్రి తెలిపారు. వీటన్నింటిపై విచారణ జరిపి అక్రమాల నిగ్గుతేలుస్తామన్నారు.

రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం

పెనుకొండలో మూడు జిమ్‌లు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర క్రీడల మంత్రి రాంప్రసాద్ రెడ్డి అనుమతిచ్చారని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రూ.10 లక్షలతో పెనుకొండలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అన్ని జిల్లాలో స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ సిద్దయ్య, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రామకృష్ణ, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర నాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు జగన్ చూపు

వైసిపి భవిష్యత్తు అయిపోయిందని భావిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ వైపు చూస్తున్నారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ చీటీని ప్రజలు చింపేశారన్నారు. ఇదే విషయం జగన్‌కు కూడా తెలుసన్నారు. అధికారం పోగానే బెంగుళూరుకు మకాం మార్చి వారానికి రెండు రోజులు వచ్చి, హడావుడి చేసి వెళ్తున్నారన్నారు. వైసిపికి భవిష్యత్తులేదన్న విషయం జగన్‌కు అర్థమైందని, అందుకే కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు చూస్తున్నారని తెలిపారు. ప్రజలు ఆయన పనులన్నింటినీ గమనిస్తున్నారని చెప్పారు.

హంద్రీనీవా కాలువ వెడల్పుతోనే ప్రయోజనం

◆ లైనింగ్ పనులు చేపడితే పగలగొడతాం ◆ ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాయలసీమ రైతులకు జీవనాడిగా ఉన్న హంద్రీనీవా కాలువను వెడల్పు చేయకుండా, లైనింగ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం రైతులకు నష్టం చేకూర్చడమే అవుతుందని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే ఆపి, వెడల్పు పనులను చేపట్టాలని కోరుతూ ఏపీ రైతుసంఘం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎ.హరి అధ్యక్షతన సోమవారం నాడు పుట్టపర్తి కర్షక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80వేలు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రస్తుత కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదన్నారు. వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువ వెడల్పు చేయాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగసభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఇప్పటికీ ఆ హామీ నెరవేరలేదన్నారు. రానున్న బడ్జెట్‌లో హంద్రీనీవా కాలువ వెడల్పు, పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు, ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేలా అవసరమైన పంటకాల్వల నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కోరారు. రైతులకు లైనింగ్ వల్ల తీవ్ర నష్టం జరుగుతున్న నేపథ్యంలో దానిని ఆపాలన్నారు. ప్రభుత్వం మొండిగా వెళ్తే లైనింగ్ పనులు చేసే యంత్రాలను పగులగొడతామని హెచ్చరించారు. అనంతపురం రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, సిపిఐ రైతు సంఘం జిల్లా నాయకులు మహదేవ, కాటమయ్య, రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు గిరీష్, ఎపి రైతు సంఘం నాయకులు సోమశేఖర్, రమణ, లక్ష్మి నారాయణ, రాజారామిరెడ్డి, సిద్దారెడ్డి, కదిరిప్ప, మారుతీ, శ్రీరాములు, నాగిరెడ్డి, పాల్గొన్నారు.

ఖాద్రీశుడి ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామీ హుండిల లెక్కింపుకార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నగదుగా రు.82,64,892/- రూపాయలు వచ్చిందని ఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.బంగారు 12 గ్రాములు, వెండి 302 గ్రాములు, విదేశీ కరెన్సీలో అమెరికా డాలర్స్ 21, కెనడా డాలర్స్ 20, ఆస్ట్రేలియా 20, ఉమెన్ కంట్రీ 7 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, .ప్రసాద్, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండలమీట్

ప్రజాశక్తి - బత్తలపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహనాయుడు తెలిపారు. ఎంపిపి ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, ఇతర సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం నుండి బెంగళూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన నివాసాలు వున్న ఎల్ 4 కాలనీ, కేతిరెడ్డి కాలనీ ప్రజలు తాగునీటి కోసం సోమవారం రోడ్డెక్కారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల వాసులు మాట్లాడుతూ చాలా రోజులనుండి ఇక్కడ నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, డి ఈ సాయికృష్ణ కాలనీ వద్దకు వచ్చి నిరసన కారులతో మాట్లాడారు. ఇక్కడ మోటార్లు పాడయ్యాయని రెండు రోజుల్లో వాటిని మరమ్మతులు చేయించి నీటి సరఫరా సక్రమంగా ఉండేటట్లు చూస్తామన్నారు. అంతవవరకు ట్రాక్టర్లతో ట్యాంక్ ల ద్వారా నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిదంగా డ్రైనేజీలు, విద్యుత్ లైట్లు లను వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్ రాజు, వెంకటరాముడు, వెంకటస్వామి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జిల్లాలో 108.5 హెక్టార్లలో పంట నష్టం

ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్రమైన గాలులకు అధిక సంఖ్యలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ధర్మవరం నియోజకవర్గం తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలలోని తొమ్మిది గ్రామాలలో అరటి తోట పూర్తిగా నేలకొరిగినట్టు తెలిపారు. ఒక్క దాడితోట గ్రామంలో అధికంగా 80 హెక్టార్లు మేర అరటి తోట నేలకొరిగినట్లు చెప్పారు. ఇప్పటివరకు నాలుగు బృందాలు జిల్లావ్యాప్తంగా తిరుగుతూ ఉద్యాన వన పంటల నష్టాన్ని గుర్తించినట్లు చెప్పారు. ఎంత మేర నష్టం వాటిల్లిందన్న దానిపై ప్రాథమిక అంచనా వేసి కలెక్టర్ కి సమర్పించడం జరుగుతుందని చంద్రశేఖర్ తెలిపారు. ప్రస్తుతానికి జిల్లా వ్యాప్తంగా 108.5 హెక్టార్లలో నష్టం వాటిల్లిందని 117 మంది రైతులు నష్టపోయారని చెప్పారు, పూర్తి నివేదిక రాగానే కలెక్టర్ కి సమర్పించడం జరుగుతుందని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

విద్యార్థిపై వార్డెన్ దాడి

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ మండలం నాగలూరు గ్రామంలోని పి సి ఎం ఆర్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కిషోర్ అనే విద్యార్థిని ఆదివారం రాత్రి పాఠశాల వార్డెన్ చితకబాదిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈసందర్భంగా గొట్లూరు కి చెందిన విద్యార్థి కిషోర్ తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో స్టడీ అవర్స్ ముగిశాక డయాస్ పైకి వెళ్లాలని వార్డెన్ విద్యార్థులను ఆదేశించాడన్నారు. అయితే విద్యార్థి కిషోర్ వెళ్లకపోవటంతో వార్డెన్ ఆగ్రహానికి గురై కిషోర్‌ను తీవ్రంగా కొట్టారన్నారు. విద్యార్థి శరీరం పై వాతలు పడి రక్తం గడ్డ కట్టిందన్నారు. ఈ మేరకు వార్డన్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు చెప్పారు.

సజావుగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి గణితం పరీక్షలు 104 కేంద్రాల్లో నిర్వహించినట్లు డిఇఒ కిష్టప్ప, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 21,394 మందికి గాను 21,283 మంది హాజరయ్యారన్నారు. దీంతో 99.48 శాతం హాజరునమోదయిందన్నారు. ప్రయివేటు విద్యార్థులు 235 మందికి గాను 201 మంది హాజరయ్యారు. దీంతో 85.53 శాతం హాజరు నమోదయిందన్నారు. అలాగే అపోస్ పదవ తరగతి పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో పరీక్షలు జరగగా 585 మంది విద్యార్థులకు గాను 466 మంది హాజరయ్యారన్నారు.

విద్యుత్ టవర్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో విద్యుత్ టవర్ల ఏర్పాటుకు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలో ఎమ్మెల్యే నేతృత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ భూపతి, ఎంఎల్‌ఏ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం కార్డులు చూపుతున్న నాయకులు

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి సభ్యత్వ కార్డులను బూత్ కమిటీ సభ్యులకు నాయకులు పంపిణీ చేశారు సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుటుంబ సాధికార కెఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కార్యకర్తలు కోరారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు పచ్చ అశోక్, బాలకృష్ణ చౌదరి, వేణు రాయల్, మరిరెడ్డిపల్లి నరసింహులు, హజ్మతుల్లా, నిమ్మల శ్రీధర్, నరేంద్ర, బూత్ కమిటీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు

'పది' పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజా శక్తి బుక్కపట్నం.

మండల కేంద్రంలోని బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తహశీల్దార్ షాబుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న తీరు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. సోమవారం జరిగిన గణితం పరీక్షకు 286 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరైనట్లు ఎంఇఒ తెలిపారు.

మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అశ్వర్థనారాయణ

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలో సోమవారం జరిగిన మడకశిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా అశ్వర్థనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా హెచ్ ఎస్ కిష్టప్ప, కార్యదర్శిగా కెసి ఉమేష్ చంద్ర, సహాయ కార్యదర్శిగా ఎన్ దివాకర్, కోశాధికారిగా నాగరాజు ,లైబ్రరీ ఇన్చార్జిగా రంగనాథ్‌ను ఎన్నుకున్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: PENUKONDA
A.S. No:49/2010

Between:
Kukkala Anjanamma and others ...**Petitioners-Appellants**
And
M.Parvathamma and others ...**Respondents**

పై నెంబరు అప్పీలులోని I.A.283/24లో R21, I.A.284/24లో R15 to R18, I.A.285/24లో R19,20 I.A.286/24లో R15 to R21, I.A.287/24లో ప్రతివాదికి, I.A.292/24లో R15 to R18, I.A.293/24లో ప్రతివాదికి I.A.294/24లో R21, I.A.295/24లో R19, R20, I.A.296/24లో R19 ప్రతిదులకు Sec 5, Order 22 Rule 9 CPC Order 22 Rule 4, Order 32 Rule 3 CPC నోటీసులు

1) .I.A.283/24లోని 21 ప్రతివాదికి నోటీసు
R21:Sowjanya W/o Late Suryanarayana, Chinthamanipalli, Kondapuram Post, Gorantla Mandalam.

2).I.A.284/24లోని 15 నుండి 18 ప్రతివాదులకు నోటీసులు
R15:Alivelamma W/o Tailor Rangappa, Chinthamanipalli, Kondapuram Post, Gorantla Mandalam.
R16:Krishnamma W/o Sreeramulu, Veerajinnaiahpalli, Puttaparthy Mandalam.
R17:Santhamma W/o Lakshminarayana, Kollukunta, Hindupur Mandalam.
R18:Harish S/o Govindappa, Chunduruvandlapalli, Gorantla Mandalam.

3).I.A.285/24లోని R19,R20 ప్రతివాదులకు నోటీసులు
R19:Nirmala W/o Mallikarjuna, Nallarallapalli, Chilamathur Mandalam.
R20:Varshika D/o Mallikarjuna, (Minor) Represented by her Mother and Guardian Nirmala W/o Mallikarjuna, (R19) Nallarallapalli, Chilamathur Mandalam.

4).I.A.286/24లోని 15 నుండి 21 ప్రతివాదులకు నోటీసులు
R15:Alivelamma W/o Tailor Rangappa, Chinthamanipalli, Kondapuram Post, Gorantla Mandalam.
R16:Krishnamma W/o Sreeramulu, Veerajinnaiahpalli, Puttaparthy Mandalam.
R17:Santhamma W/o Lakshminarayana, Kollukunta, Hindupur Mandalam.
R18:Harish S/o Govindappa, Chunduruvandlapalli, Gorantla Mandalam.
R19:Nirmala W/o Mallikarjuna, Nallarallapalli, Chilamathur Mandalam.
R20:Varshika D/o Mallikarjuna, (Minor) Represented by her Mother Nirmala W/o Mallikarjuna, Nallarallapalli, Chilamathur Mandalam.
R21:Sowjanya W/o Late Suryanarayana, Chinthamanipalli, Kondapuram Post, Gorantla Mandalam.

5). I.A.287/24లోని ప్రతివాదికి నోటీసు
To,
Varshika D/o Mallikarjuna, (Minor) Represented by her Mother and Guardian Nirmala W/o Mallikarjuna, (R19) Nallarallapalli, Chilamathur Mandalam.

6).I.A.292/24లోని 15 నుండి 18 ప్రతివాదులకు నోటీసులు
R15:Alivelamma W/o Tailor Rangappa, Chinthamanipalli, Kondapuram Post, Gorantla Mandalam.
R16:Krishnamma W/o Sreeramulu, Veerajinnaiahpalli, Puttaparthy Mandalam.
R17:Santhamma W/o Lakshminarayana, Kollukunta, Hindupur Mandalam.
R18:Harish S/o Govindappa, Chunduruvandlapalli, Gorantla Mandalam.

7). I.A.293/24లోని ప్రతివాదికి నోటీసు
To,
Varshika D/o Mallikarjuna, (Minor) Represented by her Mother and Guardian Nirmala W/o Mallikarjuna, (R19) Nallarallapalli, Chilamathur Mandalam.

8). I.A.294/24లోని R21 ప్రతివాదికి నోటీసు
R21:Sowjanya W/o Late Suryanarayana, Chinthamanipalli, Kondapuram Post, Gorantla Mandalam.

9).I.A.295/24లోని 19 నుండి 20 ప్రతివాదులకు నోటీసులు
R19:Nirmala W/o Mallikarjuna, Nallarallapalli, Chilamathur Mandalam.
R20:Varshika D/o Mallikarjuna, (Minor) Represented by her Mother Nirmala W/o Mallikarjuna, Nallarallapalli, Chilamathur Mandalam.

10). I.A.296/24లోని ప్రతివాదికి నోటీసు
To,
Varshika D/o Mallikarjuna, (Minor) Represented by her Mother and Guardian Nirmala W/o Mallikarjuna, (R19) Nallarallapalli, Chilamathur Mandalam.

ఇందుమూలకముగా మీకు తెలియచేయడం ఏమనగా పై నెంబరు అప్పీలులోని 6,11,13, ప్రతివాదులు చనిపోయి నందున వారి యొక్క వారసులుగా మిమ్ములను అప్పీలులో చేర్చుటకు గాను పై అర్జీలను దాఖలు చేసినారు. సదరి విషయములై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు పై కోర్టులో 28/03/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై నీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు పై అర్జీలను తీర్మానము చేయుదురని యిందు మూలకముగా నీకు తెలియజేయడమైనది.

(By Order of the Court)

ఇట్లు
శ్రీ ఆర్.శ్రీకాంత్ రెడ్డి,
అర్జీదారులపరం వకీలు, పెనుకొండ.

డీ లిమిటేషన్‌పై నోరు విప్పండి

బాబు, పవన్, జగన్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

డీలిమిటేషన్‌పై చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జగన్మోహన్‌రెడ్డి నోరు విప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. హిందూపురం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో సిపిఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ తో భారత రాజ్యాంగానికి పెను ప్రమాదం ఏర్పడిందని దేశ ప్రజలందరూ రాజ్యాంగ పరిరక్షణకు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐకమత్యంతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ల స్ఫూర్తితో పోరాటాలను ఉదతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి లౌకికవాదులంతా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో జరుగుతున్న నరేంద్రమోడీ మత విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. అలాగే దక్షిణ భారతదేశం పట్ల ఉత్తరాది వివక్షత విడనాడాలని, ఎక్కువ ఆదాయం, పన్నులు దక్షిణాది నుంచి కేంద్ర ప్రభుత్వానికి వెళ్తున్నాయని, అయితే కేంద్ర ప్రభుత్వం నిధులు దక్షిణ భారతదేశానికి తగ్గించడం సరైనది కాదని అన్నారు. డీ లిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయని అయితే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైసిపి అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఈ విషయంలో కనీసం మాట్లాడడం లేదన్నారు. మోడీ ఏమి చేసినా ఈ ముగ్గురు జై అంటున్నారే తప్ప ఏ ఒక్కరు వ్యతిరేకించడం లేదన్నారు. ప్రశ్నించడానికి పార్టీ పెట్టానని అన్న పవన్ కళ్యాణ్ ప్రశ్నించడం మాని మోడీ విధానాలకు జై అంటున్నారని ఎద్దేవా చేశారు. కనీసం అధికారంలో లేని జగన్ సైతం దీనిపై నోరు విప్పక పోవడం చూస్తుంటే బిజెపి పెద్దలు ఎంతలా వారిని భయపెట్టారో అర్థం అవుతుందన్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ పేరుతో దంబాలు కొట్టుకుంటూ పాలన చేస్తున్నారే తప్ప కేంద్రం నుంచి రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క పైసా కూడా ప్రత్యేక నిధులు తీసుకురాలేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజలకు ఈ వేసవిలో నీటి సౌకర్యం కల్పించాలని, హంద్రీనీవా ద్వారా తాగునీరు, సాగనీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, జనసేవ దల్ వాలంటీర్స్ రాష్ట్ర నాయకులు మురళి, సీపీఐ తాలూకా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పెండింగ్ వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8నెలలు వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లాకార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ కుల్లాయప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్ అనంత ఆచారికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 8నెలలు వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని అక్రమ తొలగింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కార్మికులు ఆంజనప్ప, గంగులప్ప, లక్ష్మీదేవి, నిర్మల‌శ్రావణి, నాగమ్మ, సాలెమ్మ, భాగ్యమ్మ, ఓబుళమ్మ పాల్గొన్నారు.

నాటుసారాపై నిఘా పెంచండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం రవాణా, నాటు సారా తయారు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ అధికారి నాగముద్దయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నాగమద్దయ్య అధ్యక్షతన అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర సింహులు సత్య సాయి జిల్లా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు తో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగమద్దయ్య

ఈ సమావేశంలో భాగంగా నవోదయ 2.0 లో భాగంగా ఏబీసీ గ్రామాలను రివ్యూ చేయాలని, నాటు సారా తయారీదారులపై నిఘా పెంచాలని, అమ్మకం దారులపై కేసులు నమోదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనిఆదేశించారు. అదేవిధంగా నాటు సారా తయారీకి కావలసిన బెల్లం అమ్మకం దారులను రవాణా దారులను బైండోవర్ చేయాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.ఇతర రాష్ట్రాల మద్యం చొరబడకుండా అరికట్టాలని సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచాలని చెప్పారు. శిస్తు కట్టని మద్యం అమ్మకం దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్‌చ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు , పుట్టపర్తి ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, శ్రీ సత్య సాయి జిల్లా ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం



కదిరిలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ క్షయ వ్యాధిని నివారించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ ప్రజలకు సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో కదిరి ఏరియా హాస్పిటల్ నుండి టవర్ క్లాక్ మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు సాయంత్రం పూట జ్వరము ఉంటే కచ్చితంగా దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ళ పరీక్ష ఎక్సరే తీయించుకోవాలని వ్యాధి నిర్ధారణమైనట్లయితే మందులు సక్రమంగా ఆరు నెలలు వాడాలని చెప్పారు. రోగులకు మందులు పరీక్షలు అన్నీ ఉచితంగా అందజేస్తామన్నారు. టిబి యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ టీబీ రోగుల పౌష్టికాహారం కొరకు ప్రభుత్వం నెలకు 1000 రూపాలయ చొప్పున ఆరు నెలలకు 6000 రూపాయలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి రూరల్ : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ప్రారంభించారు. జిల్లా వైద్య శాఖ అధికారి ఫిరోజ్‌బేగం, జిల్లా టి. బి. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి తిప్పయ్య,, డి.ఎస్.పి విజయ్ కుమార్ ,ప్రసాద్ రెడ్డి , ఐఎంఎ ప్రెసిడెంట్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, డాక్టర్ వాసుదేవరెడ్డి, ధర్మవరం ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ గాయిత్రి, టి బి జిల్లా సూపర్వైజర్ హబీద్ భాష, టిబి మెడికల్ ఆఫీసర్, ఇతర ప్రోగ్రామ్ అధికారులు , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సంవత్సర కాలంలో టి. బి. వ్యాధి నివారణ కార్యక్రమం లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి, టిబి. ముక్త్ భారత కార్యక్రమంలో ఎంపికైన 29 పంచాయతీలకు అవార్డులను జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశ వర్కర్లు, సంస్కృతి కళాశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద మానవహారం నిర్వహించారు.

పావగడ : క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అని టిబిహెచ్‌వి అధికారి పవన్ అన్నారు. సోమవారం పట్టణంలోని సంత మైదానంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా వీధినాటకం ప్రదర్శించి క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తాలూకా వైద్యాధికారి డాక్టర్ బాబు, ఇన్‌ఛార్జి ఆరోగ్య విద్యాధికారి సురేష్ . సీనియర్ హెల్త్ ఇన్స్‌పెక్టర్ రాజన్న, కళాబృంద సభ్యులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో టీబీపై ర్యాలీ నిర్వహించారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భూసేకరణ ఆపాలని వినతి

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీ పరిధిలోని జమ్మానిపల్లి, తురకవాండ్ల పల్లి, గౌడనహళ్లి గ్రామాల పరిధిలో చేపట్టిన ఎపిఐఐసి రెండవ విడత భూసేకరణను ప్రభుత్వం ఆపాలని రైతులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూభూసేకరణ చేస్తే తమ కుటుంబాల పోషణకు దిక్కులేకుండా పోతుందని అన్నారు. ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. ఇరవై సంవత్సరాల క్రితం గౌడనహళ్లి అనంతపురం పంచాయతీల నుంచి పదహారు వందల ఎకరాలు ఇచ్చామన్నారు. ఇక కొద్దీ భూమే ఉందని ప్రభుత్వం భూసేకరణ నిలుపుదలచేసి తమకు భరోసా కల్పించాలని కలెక్టర్‌కు కోరారు. ఈ కార్యక్రమంలో గౌడనహళ్లి పంచాయతీ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గిరిజన భూములు కబ్జా చేసిన ఎంపిపిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి కి చెందిన గిరిజన భూములను కబ్జా చేసిన ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పై సహకరించిన అధికారులపై తమ చర్యలు తీసుకోవాలని బంజారా సంక్షేమ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు సమర్పించారు. అనంతరం ఆ సంఘం నాయకులు శ్రీనివాస్ నాయక్, విద్యార్థి సంఘం నాయకులు రవీంద్ర నాయక్ తదితరులు మాట్లాడుతూ అమాయకులైన గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ఎంపీపీ తన బంధువుల పేరిట 1బి లో ఎక్కించుకొని, బ్యాంకులలో రుణాలు పొందారని ఆరోపించారు. ఇందులో ధర్మవరం ఆర్డీవో మహేష్, ముదిగుబ్బ తహశీల్దారు నారాయణస్వామి పాత్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన మోసాన్ని కలెక్టర్, ముఖ్యమంత్రి రెవిన్యూ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. అయినా ప్రభుత్వం కానీ అధికారులు కానీ పట్టించుకోలేదన్నారు. ఎంపీపీ బీజేపీకి చెందిన వాడని మంత్రి సత్య కుమార్ తో ఉన్న సంబంధాలతో తమకు న్యాయం జరగలేదని ఆరోపించారు. ఉన్న కొద్దిపాటి భూములు అన్యాక్రాంతం అయితే గిరిజనులు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ భూభాగోతం పై తగు చర్యలు తీసుకొని ప్రత్యేకంగా విచారణ జరిపించి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ఎంపీపీ తో పాటు ఆయన బంధువులు గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సేవే నాయక్, రమణ నాయక్, బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పంట నష్టంపై నివేదిక

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడి తోట నాయనపల్లి తురక వారి పల్లి గ్రామాల పరిధిలో గత శనివారం రాత్రి వీచిన గాలి వాన, వడగళ్ల బీభత్సానికి భారీగా అరటి మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని హార్టికల్చర్ అధికారిని అమరేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం సంబంధిత గ్రామాలలో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను కలిసి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలను కోల్పోయిన రైతుల వద్ద సమాచారం సేకరించి రెండు రోజులలో పంట నష్టం పై నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని అన్నారు. పంటలు కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, వన్ బి, బ్యాంక్ అకౌంట్, ఒక కలర్ పాస్ ఫోటో,తో పాటు రైతు సాగు చేసిన పంట వివరాలను జతపరిచి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాజకుల్లయప్ప, కన్నప్ప, సచివాలయ హార్టికల్చర్ సిబ్బంది రామాంజనేయులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తోపాటు బాధిత రైతులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని, ఇందుకూరు, కొడవండ్లపల్లి, మర్తాడు, ఈదులపల్లి, దొరిగల్లు, కొండగట్టుపల్లి, కోటిరెడ్డిపల్లి, గ్రామాల్లో అకాల వర్షం



తాడిమర్రిలో నేలకొరిగిన అరటిపంటను పరిశీలిస్తున్న అధికారులు

కారణంగా దెబ్బతిన్న రైతుల అరటి తోటలను మంత్రి కార్యాలయ నాయకులు సోమవారం పరిశీలించారు. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాల కారణంగా రైతుల పండ్ల తోటలు దెబ్బతిన్నాయన్న సమాచారం తెలుసుకున్న మంత్రి ఆదేశాల మేరకు పంటపొలాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టపరిహారం తక్షణమే అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని తూపల్లి పంచాయతీలోని వంకపల్లి చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా తెలిపిన వివరాలు.. వంకపల్లికి చెందిన రాజేశ్వరి (29) వేపరాళ్ల సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఈ మేరకు ఆమె సోమవారం తన నివాసంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు మృతికి ఆమె భర్త కారణమని మృతురాలి తల్లి వద్దిరెడ్డి రామసుబ్బమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త వేధింపులే రాజేశ్వరి మృతికి కారణమని ఆమె ఆరోపించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

విద్యార్థిని మిస్సింగ్ .. పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - బత్తలపల్లి

సర్టిఫికెట్లు జిరాక్స్ చేయించుకుని వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థిని మూడు రోజులుగా కనిపించకుండా పోయినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు బత్తలపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన నాగభూషణ కుమార్తె అనంతపురం పట్టణంలోని పీవీకేకేలో బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుకుంటోంది. శనివారం ఇంటి వద్ద నుంచి రామాపురం కూడలిలో సర్టిఫికెట్లను జిరాక్స్ చేయించుకు వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది.ఆ తరువాత ఇంటికి రాలేదు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారించారు. ఎక్కడా ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ పరిధిలోని పోతుకుంట ఇందిరమ్మ కాలనీ లో సోమవారం రూరల్ సిఐ ప్రభాకర్ గౌడ్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేశారు.కాలనీ లోని ప్రతీ ఇంటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో పోలీసులు మాట్లాడుతూ ఎలాంటి గొడవలు లేకుండా జీవించాలని, ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కొరియర్ వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి - బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని బత్తలపల్లి బైపాస్ రోడ్డులో సోమవారం అదుపుతప్పి కొరియర్ వ్యాను బోల్తా పడింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి వైపు నుంచి అనంతపురం వైపునకు వెళుతున్న కొరియర్ వ్యాను బత్తలపల్లి బైపాస్ రోడ్డులో వేల్పుమడుగు క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాను కొద్ది దూరం వెళ్లి డివైడర్‌ను ఢీ కొని ఆగిపోయింది. వ్యానులో డ్రైవర్ ఒక్కడే ఉన్నట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆటో ప్రమాదంలో బాలిక మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకొన్న ఆటో ప్రమాదంలో కొట్నూరుకు చెందిన నరసింహమూర్తి రెండో కుమార్తె వైష్ణవి(13) దుర్మరణం చెందింది. ఇంటి సమీపంలో ఆపిన బంధువులకు చెందిన ఆటోలో వైష్ణవి వెనక వైపు కూర్చోంది. ఆటోను ఆన్ చేసి ముందుకు నడిపించే సమయంలో ఈమె కిందకు దూకటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వీరు అదే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరగలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పటి వరకు తమతో కలిసి ఉన్న చిన్నారి ఇక లేదని తెలుసుకొన్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై స్థానిక వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కగల్లు గ్రామ సమీపంలో గల చెరువు వద్ద ముళ్ళపొదల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుని సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఇతను సుమారు నాలుగు రోజుల కిందట ఇక్కడ పనుకొని ఉండి అలాగే చనిపోయినాడని, ఒంటిపై ఎలాంటి అనుమానిత గాయాలు లేవని స్థానికులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమచారం మేరకు అప్ గ్రేడ్ స్టేషన్ ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్నిపోస్టు మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని చోలేమర్రి మాజీ సర్పంచి జైశ్రీరామ్ సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె పార్థసారథి అల్లుడు శశిభూషణ్ పటేల్ మృతుని స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుబ్బ రత్నమ్మ సర్పంచి జనార్దన్, రామకృష్ణ, సత్యశేఖర్, మారెప్ప, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం

చిలమత్తూరు : చిలమత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న వారపు సంత, బస్టాండ్, జంతువదశాల, షాపింగ్ కాంప్లెక్స్ రూములు వేలం పాటను మంగళవారం నిర్వహిస్తున్నట్లు సర్పంచి సంధ్య, కార్యదర్శి సావిత్రి తెలిపారు. ఈ మేరకు వారపు సంత, బస్టాండ్, షాపింగ్ కాంప్లేక్స్ రూములకు డిపాజిట్ రూ.50 వేలు. జంతువధశాలకు రూ.5 వేలు ఎస్సీ రిజర్వ్ రూంకి రూ.10 వేలు చెల్లించాలని అన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు మొదట డిపాజిట్ చెల్లించాలని అలాగే పాటలో పాడుకున్న మొత్తాన్ని ఒక్కసారిగా చెల్లించాలని చెప్పారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పెనుకొండ : ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి సవిత సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని మంత్రి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గంలోని పెనుకొండ ,రొద్దం, పరిగి ,గోరంట్ల మండలాలకు చెందిన 35 మందికి 33,86,598 రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే నియోజకవర్గంలో 93 మందికి రూ.83 లక్షలు భాదితులకు అందించామన్నారు. పేద ప్రజలకు అత్యవసర పరిస్థితిలో మెరుగైన ఆరోగ్య సేవలు పొందడానికి ముఖ్యమంత్రి సహాయనిది ఎంతగానో ఉపయోగకరం అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కొత్తచెరువు : కొత్తచెరువులో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కొత్తచెరువు అప్ గ్రేడ్ ఇన్‌ఛార్జి సిఐ సురేష్ తెలిపారు. బుక్కపట్నం రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్ల పైన వ్యాపారులు, తోపుడుబండ్లు ఏర్పాటు చేసుకొని పండ్ల వ్యాపారాలు, పూల వ్యాపారాలు నిర్వహిస్తున్నందున వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. వ్యాపారులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోనందునే ఇలా తొలగించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా వాహనదారులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు